# మమత - భ్రమత

ఒకటోనంబరు బ్రాంచి కెనాల్ కట్టమీద సోలుపుగా ఉన్న తాళ్ల కర్రలోంచి సూర్యుడు ఎర్రగా, గంభీరాతిశయంగా నిష్క్రమిస్తున్నాడు. కన్నెమనసులోని కోర్కెల తేనెపొరల్లా క్రేగాలి వీస్తోంది. అంతకు ముందు రోజే భారీవర్షం పడింది. అదిగాక కాలువలకు దిట్టంగా నీళ్ళు వదిలారు. పొలాలన్నీ తడిశాయి. వూడ్పులపని ఉధృతం కాసాగింది. కొన్ని చేలు అప్పుడే లేత ఆకుపచ్చ చీరలు ధరించి భూమాత బిడ్డల్లా పచ్చగా కళకళ లాడుతున్నాయి. ఏరువాక పౌర్ణమి ఇంకా వారంరోజులే ఉంది.

షావుకారు వెంకటసుబ్బయ్యగారి రేగడి చేనులోంచి పాలేరు కోటేశు పార చేత్తోపట్టుకుని గనుం ఎక్కాడు. దమ్ము చేయడానికి వచ్చిన ముగ్గురు కూలీలూ గంట క్రితమే గూళ్ళకు చేరుకున్నారు. కురదలాలన్నింటినీ పూర్తిచేసి పైపై మెరుగులతో చేనును అందంగా తీర్చి దిద్దటానికి కోటేశు అక్కడే దిగబడ్డాడు. ఏ పని చేసినా అతని మనస్సుకు సొంతం నచ్చాలి. పార గట్టుమీద వేసి, కడ ప్రొద్దుకు చేయి అడ్డం పెట్టుకొని, తనువెల్లా కన్నులు చేసికొని రేగడి చేనుకు ఒక్కసారి తేరిపార జూశాడు. సొగసుగా చెక్కబడ్డ గనుములతో, మెరకా పల్లాల్లేని నీటితో, పిచ్చి మొక్కగానీ, మట్టిదుబ్బుగానీ కంటికి కనిపించని చదునుతో ఆ చేను ఇబ్బడి సుందరంగా ఉంది.

‘రేపు అయ్యగారు చూసి నా పనితనానికి మెచ్చుకోవాలి’ అనుకున్నాడు కోటేశు, మోకాళ్ళలోతు బురదను పంటకాలువ నీళ్ళలో కడుక్కుంటూ. మట్టగోశవిప్పి, చెంగులు విడిచాడు. తలగుడ్డతీసి గాలిలో దులిపాడు. గట్టునపాతిన ముల్లుగర్రకున్న చొక్కాను తీసివేసుకున్నాడు. కట్టుపంచనిండా మట్టిమరకలే. తలగుడ్డకూ, మొహానికీ, వొంటికీ అడపా దడపా బురద మరకలు అంటాయి.

ప్రొద్దు వాలిపోతోంది. ఇంటికి పోదామనుకున్న కోటేశు మనస్సులో అదాట్టుగా వో ఆలోచన పోటకత్తిలా పొడుచుకొచ్చింది. రేగడి చేను ప్రక్కన ఓ కుంట మేరకు బారుగా మట్టిదిబ్బ ఉంది. ఆ దిబ్బమీద తొలకరి వానలకు పచ్చగా గరిక పట్టింది. గిత్తలకు ఆ పచ్చిగడ్డిని నాలుగు పనలు కోసుకెళ్ళితే ఫలహారంగా తింటాయి. అనుకున్నదే తడవుగా కోటేశు మళ్ళీ తలగుడ్డ బిర్రుగా చుట్టి దిబ్బమీదకు ఒంగాడు.

నాయుడుగారి పల్లపుచేలో నాటువేసి వెళుతూన్న కూలీలు తుమ్మెద పదాలు పాడుకుంటూ డొంక పుచ్చుకున్నారు. ఆ పదాల్ని అస్పష్టంగా పెదవులపై ఆడిస్తూ, మునిగాళ్ళమీద కూర్చుని కొడవలి కక్కితో కోటేశు గబగబా పచ్చిగడ్డి కోసి తలగుడ్డతో మూట గట్టాడు.

మెత్తని మనస్సు కన్నీరు కార్చినంత నిశ్శబ్దంగా మునిచీకటి ప్రవేశించింది. కోటేశు వూళ్ళోకి వచ్చేసరికి ఆ మునిచీకటి ముదురు చీకటిగా మారింది.

పెంకుడు చావటి మెల్లామీద కట్టుగొయ్యల దగ్గర కాళ్లు గుదుళ్లు పట్టి మోరలెత్తి తన రాకకోసం ఎదురుత్రోవలు చూస్తోన్న గిత్తలకు కోటేశు ఆ పచ్చిగడ్డి వేశాడు. అవి ఆత్రంగా మెడలువంచి, ముట్టెలు సాచి తింటూంటే — ఆ చీకటిలోనే వాటికేసి కొండంత సంబరంతో చూస్తూ కొంచెంసేపు నిలబడ్డాడు. ‘నా గిత్తల్ని కొట్టేగిత్తలు ఈ జిల్లా హోల్ మొత్తంలో ఎక్కడా లేవు’ అనుకున్నాడు కోటేశు. తర్వాత అతను వెనుకనున్న వాముల దొడ్లోకి వెళ్ళి పదిపనల చెత్తా, నాలుగు జనప కట్టెలూ దూసి — చావిటిలో మచ్చుక్రింద వేసి, పంపు దగ్గర కాళ్ళూ, చేతులు కడుక్కొని ఆసామి ఇంటికెళ్ళాడు.

మేడముందు వసారాల్లో చేతులుగల ప్రేం పడక కుర్చీలో కూర్చుని షావుకారు వెంకటసుబ్బయ్యగారు భార్య సౌభాగ్యమ్మతో కులాసాగా ఊసులాడుతున్నాడు. కోటేసు వచ్చి తలగుడ్డతీసి క్రిందవేసికొని వసారా గడపమీద చతికెలబడ్డాడు.

"ఏంరా! కోటేశూ! రేగడిచేను దమ్ము అయిందా!" అన్నాడు షావుకారు వెంకటసుబ్బయ్యగారు చేబ్రోలు పుగాకు కాడను పాయలుగా చీలుస్తూ.

"అయింది దొరా! అద్దం లాగుంది చేను. రేపు సుబ్రంగా నాటేయొచ్చు. ఎంకిగాడితోకూడా చెప్పా—పదిమంది కూలీలను రేపొద్దున పంపించమని. పెద్దచేను మడిలో నారేద్దామా? అయి ఆర్ టి నిరుడు బాగా పండిందంట. ఈ ఏడు అది వేద్దాం. ఎకరానికి రెండు పుట్లకాడికి ఏకబిగిన రాలాలి!" అన్నాడు కోటేశు నులివెచ్చని ఉత్సాహంతో.

"సరే, రేపు అదే నాటించు" అన్నాడు షావుకారు.

సౌభాగ్యమ్మ అక్కడనుంచి లేచి, "ఓరేయ్ కోటేశూ! గిన్నె కడుక్కో! త్వరగా నాలుగు మెతుకులు తిని కొంపకు చేరుకుందువుగాని, ప్రొద్దుపోతే నీ పెళ్లాం మామీదబడి ఏడుస్తుంది" అంటూ ఇంటిలోనికి వెళ్ళింది.

కోటేశు గడపమీదనుండిలేవబోతూండగా, 'ఒరేయ్! కోటేశూ!' అన్నాడు కొంచెం బరువెక్కిన కంఠంతో.

"ఏంటి దొరా!" అన్నాడు కోటేశు అమాయకత్వం తొణికిసలాడే స్వరంతో.

షావుకారు వెంకటసుబ్బయ్యగారు కొన్ని క్షణాలపాటు భ్రుకుటి ముడిచి శూన్యంలోకి చూశాడు. ఒక విషయం చెప్పటానికి ఆయనగారికి నోరు రావడంలేదు. గుండెలో ఏదో పట్టి విడుస్తూన్నది.

"ఏరువాక పూర్ణిమ ఇంకో వారం రోజులుందిగదా! ఈ యేడు కమతం ఎక్కడేనా చూచుకో!"

కోటేశు తలపై మేడ వసారా ఇనుపదూలం తటుక్కున పడినట్లయింది. నిశ్చేష్టుడై నిలువుగన్నులతో రాతి విగ్రహంవలె నిలబడిపోయాడు. కాళ్ళక్రింద భూమి జవజవలాడుతోంది. కడుపులో దుఃఖం మెరమెర లాడుతోంది. కళ్ళల్లో నీళ్లు బిలబిలలాడుతున్నాయి.

షావుకారు జోరపోతగా చెప్పుకుపోతూనే ఉన్నాడు:

"కొల్లేటి వ్యవసాయం కూటికే చాలదన్నట్లుగా ఉంది మా పని. ఈ వ్యవసాయం లాయకీగా లేదు. హాళ్ళికి హాళ్ళి సున్నకు సున్న. ఎందుకొచ్చిన బాదర బందీ! ఎడ్లను అమ్మేద్దామనుకుంటున్నాను. ఓ ట్రాక్టరు కొనిపడేస్తే అన్నివిధాలుగా అక్కరకొస్తుంది. సేద్యపు ఖర్చులు చాల కల్సివస్తాయి. అమ్మాయి పెళ్ళి కుదిరిందిగా—లక్ష కట్నం! పెళ్ళి ఖర్చుకు మరో పాతికవేలు నల్చుకు పోతాయి. ఈ ఖర్చుల సంగతి అటుంచి, వ్యవసాయంలో పాత పద్ధతులకు స్వస్తిచెప్పాలి. ఇల్లాగైతే తూగలేం. పనిపాటల వాళ్ళక్రిందే ఏటా కొన్నివేలు జారిపోతున్నాయి ఎడ్లను అమ్మితే పెద్ద పాలేరు అక్కర్లేదుగా! ఎక్కడైనా చూసుకో కోటేశూ!"

కోటేశు ఠవఠవ లాడిపోయాడు. ఏడ్పు మొహంమీదకు పడదోసుకొచ్చింది. అక్కడ క్షణంసేపు నిలబడలేక పోయాడు. యజమానికెదురు నోరు ఎత్తకుండానే చావడిలోకి వెళ్ళి భోరున ఏడ్చాడు.

రాత్రి పదిగంటలకు కోటేశు ఇంటికి వెళ్ళాడు. భార్య కోటమ్మ కళ్ళల్లో ఒత్తులేసుకొని కోడిగుడ్డు దీపంలా మేల్కొని భర్తకోసం ఎదురు చూస్తోంది. ఎనిమిదేళ్ళ కొడుకూ, నాలుగేళ్ళ కూతురూ కుక్కి మంచంలో ముయిమర్చి నిద్రబోతున్నారు.

"ఇయ్యాల ఇప్పటిదాకా ఉండావేం?" అన్నది కోటమ్మ.

కోటేశు మాట్లాడకుండా మంచమెక్కి ముసుగు తన్నిపెట్టుకొని పడుకున్నాడు. భర్త వాలకాన్ని పసిగట్టి, జరుగరానిదేదో జరిగిందని ఆమె వూహించింది. "ఏం జరిగిందో చెప్పు" అంటూ నిగ్గదీసింది. చివరకు ముసుగు కొద్దిగా తొలగించి, "అయ్యగారు ఈయేడు కమతం ఇంకోచోట చూసుకోమన్నారు" అన్నాడు కోటేశు.

అయితే దిగులెందుకు? వూరంతా వోడుపోయిందా? ఆయన వద్దంటే మరోచోట కుదుర్చుకోనేది! నిరుడే ఆ అంబయ్యగారు రెండు బస్తాలెక్కువ ఇస్తామన్నారు. నా మాట వింటేనా! అక్కడ కమతానికి కుదిరినా బావుండేది! అయినా ఇప్పుడు కొంపేం మునిగిపోయిందని మనేది పెట్టుకున్నావు. ఊళ్ళో ఆసాములెవ్వరూ జీతానికి పెట్టుకోకపోతే-రెండెకరాల పొలం పాలికితీసుకొని చేసుకోనేది. ఆమాత్రం గింజలు మిగలవా? పొయ్యిమీదకు కుండఎక్కదా? అదీ యిదీ గాకపోతే కూలీ నాలీ చేసుకోనేది. కాయ కష్టంచేసికొనే వాళ్లకు రోజులే గడవ్వా!'' అంటూ దీర్ఘాలు తీసింది కోటమ్మ.

కాని ఆ దీర్ఘాలు కోటేశు చెవులకు చేరలేదు. అతని చిత్తమంతా చిమ్మచీకటితో నిండిపోయింది. ఆ చీకటిలో ఆలోచనలు చీకిలి మాకిలిగా తిరుగాడసాగాయి. ఆ మానవుడికి చెప్పడంకంటె తెల్లని గోడకు చెప్పినా అంతో ఇంతో లాభముంటుందని భావించి కోటమ్మ సిరిచాపమీద మేను వాల్చింది.

పన్నెండేళ్ళ ప్రాయంలో కోటేశు షావుకారు వెంకటసుబ్బయ్యగారింటిలో చిన్నపాలేరుగా జేరాడు. ఇప్పుడు కోటేశు వయస్సు ముప్పైరెండేళ్ళు. ఇప్పటికీ ఆ ఇంటిలో పాలేరుగానే ఉంటున్నాడు. కాకపోతే 'పెద్ద పాలేరు'గా చెలామణి అవుతున్నాడు. జీత భత్యాలు ఏటేటా కాస్తో కూస్తో పెరుగుతూ వచ్చాయి. ఈ ఇరవైయేళ్ళ కమతంలో కోటేశు ఆ ఇంటిలో మనిషిలా అతుక్కుపోయాడని ఆ ఇంటిలోవాళ్లే కాకుండా వూళ్ళోవాళ్లు సైతం అనుకోవడంలో ఆశ్చర్య మేమీ లేదు.

షావుకారుగారి కమతంలో వుండగానే కోటేశు తల్లి దండ్రుల్ని కోల్పోయాడు. అప్పుడాయన కోటేశు భుజంమీద చేయివేసి, "నీకొచ్చిన యిబ్బందేమీ లేదు. వాళ్ళకాలం చెల్లి వాళ్ళు పరలోకానికి వెళ్ళిపోయారు. నీ బ్రతుకూ భారం నేను చూస్తాను. దిగులు చెందకు" అంటూ అభయహస్తమిచ్చాడు ఆ తర్వాత కోటేశుకు పెళ్లి చేసిందీ, ఆ ఖర్చు నంతా భరించిందీ, వాళ్ళ కాపురానికి కొంపా గోడూ ఏర్పాటు జేసిందీ—అంతా షావుకారు వెంకటసుబ్బయ్యగారే. కోటేశు సంసారానికి ఆయనే పెద్ద

దిక్కు. కోటమ్మ అహర్నిశలూ షావుకారుగారి ఇంటిలోనే ఊడిగం చేస్తూ ఉంటుంది. ఏ పనికి ఒత్తిడి ఏర్పడినా — సౌభాగ్యమ్మ ఆమెకే కాకితో కబురుచేస్తుంది. కోటమ్మ రెక్కలు గట్టుకొని వాలుతుంది. అదంతా కోటేశు భార్యకు చేసిన హెచ్చరిక ఫలితం: "మన కుటుంబం పూర్వం నుంచి షావుకారుగారి కుటుంబాన్ని నమ్ముకొనే బ్రతుకుతూన్నది. ఇంటిలో దీపం పెట్టినపుడల్లా మనం ఆయన పేరును తల్చుకోవాలి. మనం ఎంతో ఋణపడి ఉన్నాం. నీ కోసం వాళ్లు ఎప్పుడు కబురు చేస్తే అప్పుడు వెళ్ళి చెప్పిన పనల్లా చేయి."

ఆ వూళ్ళో వెంకటసుబ్బయ్యగారు చెప్పుకోదగ్గ మోతుబరి రైతు. అయినప్పటికీ ఆయన నిరాడంబరజీవి. ఆస్తికిదగ్గ సంసారం ఉన్నది. ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కొడుకు అమెరికా వెళ్లాడు – ఫౌండ్రీ ఇంజనీరింగులో రీసర్చి చేయటానికి. రెండో కొడుకు కాకినాడలో మెడిసిన్ చదువుతున్నాడు. మూడోవాడు పి. యు. సి. పెద్దమ్మాయి పెళ్ళి అయింది. ఆమెభర్త మోతుబరి రైతు. రెండో అమ్మాయికి పేరుమోసిన లాయరు కొడుకుతో మనువు కుదిరింది. పెళ్ళి ఒక మాసం రోజులే ఉంది. మూడో అమ్మాయి కడగొట్టు పిల్ల.

మొదట్నుంచీ షావుకారు వెంకటసుబ్బయ్యగారిది సొంత సేద్యమే. నిక్షేపమైన నలభై ఎకరాల మాగాణి, బంగారం పండే ఏడెకరాల మెట్ట భూమీ ఉన్నాయి. ఒక జత దున్నపోతులూ, ఒకజత గిత్తలూ, ఆగిత్తలంటే కోటేశుకు పంచప్రాణాలు. తిమ్మసముద్రంనుంచి ఆ గిత్తల్ని అతనే తోలుకొచ్చింది. అప్పటినుంచి వాటి మేపుడు, పోషణా, అలంకరణా, అలవర్చడమూ - అంతా అతనిదే. ఆగిత్తలబండి అతనేఎక్కాలి ఆగిత్తలతో దుక్కి అతనే దున్నాలి. ఆ గిత్తల బౌగాములు అతనే స్వయంగా చూడాలి. ఒకసారి మాశూలులో పడమటి పొలాలనుంచి ఓ పుట్టి ధాన్యం బండిమీద వేసుకొని వస్తూంటే దొరవారి చెరువుదగ్గర చేకూరు ఆంబోతు కాలుదువ్వి, కణేలున రంకెవేసి వాటిమీద కలహమే కళ్యాణంగా కలబడింది. ఆ ఎద్దు అసలే పోట్లమారిది. అయినప్పటికీ కోటేశు ప్రళయకాల రుద్రుడై బండి తొట్టినుంచి అమాంతంగా దూకి

వశకర్ర తీసికొని ఆ ఆంబోతుమీద యుద్ధానికి తలపడ్డాడు. అది బుసలు పెడుతూ కొమ్ములతో కుమ్మటానికి సిద్ధపడ్డా కోటేశు వెనుకంజ వేయ లేదు. దాన్ని మారెమ్మ గుడిదాకా తరిమికొట్టి, మళ్లీవచ్చి బండిఎక్కాడు. చావట్లో బండి విడిశాక, ఆ గిత్తల్ని ఒళ్ళంతా మృదువుగా నిమిరి కౌగ లించుకున్నాడు. అప్పుడుగాని అతని గొంతుకలోకి వచ్చిన ప్రాణం వెనుక చూపు చూడలేదు. మరొకసారి గిత్తలకోసం దాలిగుండంలోవేసిన ఉల వల దాణాను చిన్న జీతగాడు చాటుగా దేవుకొని తింటున్నాడు. అది కోటేశు కంటబడింది. గంగివెర్రిలెత్తిపోయాడు. చింతబరికె దీసికొని చిన్నజీతగాని చేత దణ్ణాలు పెట్టించాడు. పశువుల దాణాను మళ్లీ పొట్టలో ప్రాణంవున్నంతవరకు ముట్టుకోనని ప్రమాణాలు చేయించారు. ఈ రెండు సంఘటనలూ షావుకారు వెంకటసుబ్బయ్యగారికి తెలియరాగా "వాడికి గిత్తలమీది అభిమానం అట్లాంటిదిమరి" అంటూ వ్యాఖ్యానిం చటం జరిగింది. ఎలపటి గిత్తకు 'రాముడు' అనీ దాపటి గిత్తకు 'భీముడు' అని పేరు పెట్టి ముద్దుగా పిలుచుకునేవాడు.

కమతంలో కోటేశుతో తూగగలవాడు ఆచుట్టుప్రక్కల ఎక్కడా లేడు. దిట్టమైన కండపుష్టిగలవాడు. చిన్నప్పటినుంచీ శరీరాన్ని కాయ, కష్టంతో రాటుతేల్చాడు. ఏ క్షణంలోనూ ఒళ్లుదాచుకోడు. నమ్మినబంటు లాగా పని చేస్తాడు. వ్యవసాయ పనుల్లో వగాతెగా తెలిసినవాడు. కొండ్రవేస్తే రైల్వేలైనువలె చాళ్లు తిన్నగా వుండేవి. కుప్పవేసినా, వామి వేసినా, తాడుపేనినా, మరొకపని చేసినా — అందెవేసిన చేయి చేసి నట్టుగానే వుండేది. ఆసామిచేత 'ఇట్లాచేయాలి!' 'అట్లాచేయాలి!' అని చెప్పించుకొనే అవసరమేలేదు. కోటేశును తమ వద్ద పాలేరుగా పెట్టుకో వాలనే ఆవూళ్ళో చాలమంది రైతులు తహతహలాడి ప్రయత్నాలు చేశారు గానీ, అతనే పడనివ్వలేదు. "ఆయింటికి నాకు జన్మజన్మల బంధం. జీతం ఎక్కువిచ్చినా ఆ ఆసామినీ దొడ్డినీ, ఎడ్లనూ, పశువుల్ని వదలి రాను, రాలేను." అంటూ వుండేవాడు. షావుకారు అతనికిస్తున్న కమతం పుట్టి వోడ్లూ, వోజత మొలపంచెలూ, వోజత పై పంచెలు, వోజత చొక్కాలు, పాతసాత గుడ్డలు లెక్కలోని కొచ్చేవికావు.

ఆరోజు అపరాత్రి వరకూ కోటేశు కటిక నులకమంచంమీద పడుకొని ఆలోచనలు చేస్తూనే ఉన్నాడు. వూరు మొత్తం మాటుమణిగినా అతని కనురెప్పలపై నిద్రముంపు రాలేకపోయింది. తన నెందుకు షావుకారు ఈయేడు మరోచోట కమతం చూచుకోమంటున్నాడు? 'నిజంగా తనని భరించలేడా? ఆయనకేం తక్కువ? ఆస్తిని, డబ్బునూ ఏయేటికాయేడు ఎక్కిదక్కిగా పెంచుతున్నాడు గాని—రవ్వంత బొర్రె పెట్టలేదే! .. గిత్తల్ని అమ్మేస్తానంటున్నాడు. ట్రాక్టరు కొంటాడట. ఈ యంత్రాలొచ్చి తనబోటివాడి బొక్కెలో బొమ్మరాయి కొడుతున్నాయి. 'రాముణ్ణి, భీముణ్ణి' ఆసామి మరొకళ్ళకు అమ్మడమా? ఆయనకాబుద్ధి ఎట్లా పుట్టింది? - ఎవరైనా చెవికొరికి, బిసి ఎక్కించారేమో! నా రాముడూ .. భీముడూ .. ఆ ఆలోచన రాగానే కోటేశు గబుక్కున నులకమంచంలోంచి లేచాడు. తలుపు తెరుచుకొని బయటికొచ్చాడు.

పంచాయతీబోర్డువారి వీధిదీపాలు ఏమి కర్మ వచ్చి పడ్డదిరా బాబూ అన్నట్టు దీనంగా వెలుగుతున్నాయి. తమ ఆర్థికస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో చెప్పకనే చెబుతున్నాయి. కోటేశు గబగబా నడుస్తూ షావుకారుగారి పెంకుడి చావడిదగ్గరకు వచ్చాడు. వీధుల్లో జనసంచారం బొత్తిగా లేదు. గేటుతలుపులు తెరుచుకొని చావడిలోకి వెళ్ళి, మచ్చుక్రింద ఎండుగడ్డిలోవున్న నాలుగు జనపకట్టల్ని తీసి గాటిదగ్గర కట్టివేయబడ్డ గిత్తలకు వేశాడు. కోటేశును గుర్తుపట్టి ఆగిత్తలు మోపురాల్ని ఝుల్లుమనిపించి, మెడ పట్టెళ్ళను కదిలించి మువ్వాలు మ్రోగగా, ఆనందాతిరేకంతో బుసలు పెట్టాయి. 'వెధవది తను వాటికి రోజూ రాత్రి యింటికి వచ్చేటప్పుడు వేసే జనుపకట్టలు ఆ రోజు వేయడం మర్చిపోయాడు' పాపం! ఎంతగా ఆవురావురుమన్నాయో!' అనుకున్నాడు కోటేశు చీకటిలో మొకరం దగ్గర నిలబడి. 'పిచ్చిగొడ్లు! నోరా, వాయా! మనం ఇంత వేస్తే తింటాయి, మర్చిపోతే మోర లెగబట్టుకొని నిలబడతాయి.'' అనుకున్నాడు.

కోటేశు తిరిగి ఇంటికివచ్చి నులకమంచంమీద మేనువాల్చాడు. ఒంటి గంటకు కోడికునుకు బట్టింది.

తొలికోడి కూతకే అలవాటుప్రకారం కోటేశుకు నిద్ర మెలుకువ వచ్చింది. మంచంమీద లేచి కూచున్నాడు.

చుట్టూ కాటుకలాంటి మసిబట్టగా కోడిగుడ్డు లాంతరు తన ప్రకాశాన్ని విరజిమ్మడానికి ప్రసవ వేదన బడుతోంది.

కోటమ్మకూడా నిద్రలేచింది.

"అయ్యగారికి ఈయేడు పెద్దపాలేరు అక్కర్లేకపోతే, చిన్న పాలేరు కావాలిగా!" అన్నాడు కోటేశు గోడతో చెబుతూన్నట్టు.

"అయితే -!" కోటమ్మ అందుకుంది.

"మనవాణ్ణి పెడదాం".

"వారసత్వం పోనీయగూడదా? వాడికి నాలుగు అక్షరంముక్కలు అబ్బటం నీ కిష్టం లేదా? జీతగాడి కొడుకు జీతగాడిగానే బ్రతకాలా? దేవుడు అట్టానే రాసిపెడతాడా? అయ్యగారి కొడుకులు పెద్ద పెద్ద చదువులు చదువుకోనడమూ, మనవాడు వాళ్ళకి వూడిగం చేయడమూనా? నీకెట్టా నోరొచ్చిందయ్యా ఆమాట అనటానికి?" అన్నది కోటమ్మ గయ్యిన గచ్చపొద కదలించినట్టు.

కోటేశు మొహం చిట్లించుకుని, విసురుగా కమతంలోకి వెళ్లాడు.

కోటమ్మ ముక్కూ మూతి బిగించుకొని తాటిమట్టల చీపురు పుచ్చుకుంది బయటకేసి వూడవటానికి.

* * *

ఏరువాక పూర్ణిమ దగ్గర పడుతున్న కొందీ కోటేశుకి దిగులూ, దుఃఖమూ ఎక్కువకాసాగాయి. మనిషి చిక్కిపోతున్నాడు. పొలంలో పనికి వొంగినా, వామిలో మేత దూస్తున్నా, గొడ్లదగ్గిర బాగుచేస్తున్నా, గిత్తలకు దాణాపెడుతున్నా, నీళ్ళు తోడుతున్నా, అన్నం తింటున్నా స్నానం చేస్తున్నా, నిద్రకు తొంగున్నా — అదే దిగులూ, అదేబాధ, అదే ఆలోచనా. రోజులో కాలం ఎట్లా గడుస్తుందో, ఏంపని చేస్తున్నాడో, ఏం తింటున్నాడో అతనికి అంతుబట్టడం లేదు.

అయ్యగారూ, అమ్మగారూ రెండో అమ్మాయి పెళ్ళి పనుల్లో పూర్తిగా నిమగ్నులై ఉన్నారు. తనని గురించి పట్టించుకునేవాళ్లూ, తను సరిగ్గా తింటున్నాడో, లేదో అజాపజా అడిగేవాళ్ళూ—ఆ యింటిలో కరువైనారు. కోటేశు కొత్త దిగులుతో క్రుంగిపోసాగాడు.

ఆ రోజు దీపాలు పెట్టేవేళ సౌభాగ్యమ్మ పెరటి దొడ్లో బాదం చెట్టుక్రింద నవారు మంచంమీద కూర్చుని ఏదో వారపత్రిక చూస్తోంది. ఆవిడతో కోటేశు ధైర్యంచేసి మొర బెట్టుకున్నాడు.

"అమ్మగారూ! మీరన్నా అయ్యగారితో చెప్పాలి".

"ఏమిట్రా!"

"అదేనండమ్మగారూ! నా కమతం సంగతి."

"చెప్పారుగా! ఈ యేడు ఎక్కడేనా చూచుకో! మీ దొర గారు కోడెల్ని అమ్మివేసి ట్రాక్టరు కొంటా నంటున్నారు. ఈ వ్యవసాయం గిట్టుబాటుగా ఉండటంలేదు. ముందు ముందు బోలెడు ఖర్చులున్నాయి. నిన్ను ఒదులుకోవాలంటే మాకూ బాధగానే ఉంది. కాని ఏం చేస్తాం?" అన్నది సౌభాగ్యమ్మ పెదవి విరుస్తూ.

కోటేశు హతుడైనాడు. చెట్టునఉన్న ఆ ఒక్కఆకూ రాలిపోయి నట్టుగా, ఆ ఒక్క ఆశాజ్యోతీ ఆరిపోయింది. అవజీవాలు క్రుంగిపోయి పోయి, అడుగు ముందుకు పడక అక్కడే కొన్ని నిమిషాల పాటు కొయ్య బొమ్మలా నిలబడిపోయాడు. ఆవిడ వారపత్రికలోని సినిమా బొమ్మలపై మనస్సును లగ్నం చేసింది.

మళ్ళీ దొరగార్ని అడగటానికి నోరురాలేదు. అడక్కుండా వుండటానికి మనస్సు అంగీకరించలేదు. ఆ రాత్రంతా కోటేశు ఆ తిక్కడముక్కడతో అడకత్తెరలో పోగలాగ నలిగి నల్లేరు అయిపోయాడు.

ఏరువాక పూర్ణిమ వచ్చింది. ఆ రోజు జీతగాళ్ళకు పెద్ద పండుగ. జీతగాళ్లు పాత ఆసాముల దగ్గర్నుంచి మానుకొని, కొత్త ఆసాములవద్ద కమతాల్ని మాట్లాడుకుంటారు. పాత ఆసాముల దగ్గరవుండేవాళ్లు కొత్త కమతాన్ని ఏర్పర్చుకుంటారు. ఆ వృత్తి నే మానుకునేవాళ్ళకు అది విముక్తి

దినం. ఈ ఇరవైఏళ్ళనుంచీ కోటేశుకు ఏరువాక పూర్ణిమ ఓ పర్వదినమే కాని ఆరోజు మట్టుకు దుఃఖపూరితమైంది.

ఈరోజు యథావిధిగానే పనిలోనికి వచ్చాడు. చావడిలోని పనులన్నింటిని ముగించుకొనేసరికి తూర్పు మొహాన ప్రొద్దు కరకర పొడిచింది. కోటేశు యజమాని యింటికి వచ్చాడు షావుకారుగారు మేడ వసారా అరుగుమీద కూర్చుని పందుంపుల్లతో పళ్లు తోముకుంటున్నాడు. కోటేశు ఎదురుగావచ్చి నిలబడ్డాడు.

“ఏరా !”

“జమ్మిగుంటపాలెం వెళ్ళి పిండి చల్లి రమ్మంటారా ?’’

“ఇవాళ మీ జీతగాళ్ళ పండుగ్గదరా! పండుగనాడుకూడా పొలం పనులేనా! ఒద్దులే. ఇంటిదగ్గరుండు.”

కోటేశు హృదయం జివ్వుమన్నది.

ఆరోజు ఉదయం షావుకారుగారి ఇంటిలో కోటేశుకు దాదాపు నిండు భోజనం లభించింది. అతనిపై అభిమానంకొద్దీ సౌభాగ్యమ్మ పులిహోరా, గారెలూ, పరమాన్నమూ వండి వడ్డించింది. కాని కోటేశు ఇష్టంగా, ఉత్సాహంగా కడుపునిండా తినలేకపోయాడు. బలి పశువుకు పెట్టే ప్రత్యేకమైన ఆహారంవలె తోచింది. ఆ పైన మనస్సంతా ఎటమటమై పోయి, కోడి కెలికినట్టు కంచంలో అన్నాన్ని కెలికాడు. సౌభాగ్యమ్మ అది చూసి, అక్కసపడి, నోటికి అరచేయి ఆనించి, “ఆదేం తినటంరా! నీ కోసమని ప్రత్యేకంగా వండి వార్చితే, ముదిగారంగా మూడు మెతుకులు తిని, మిగతాది ప్రక్కకు నెట్టావు? తిను... తిను... మళ్ళీ మా ంటిలో అన్నం అమ్మాయి పెళ్ళిదాకా దొరకదు’’ అన్నది.

కోటేశు మనస్సు మసుగైంది. గుండెలో గిల్లుమన్న దుఃఖం ఏడుపు రూపంలో గొంతు వెలుపలికొచ్చి గుంటకళ్ళల్లో గుప్పుతెప్పున గట్లులేని ప్రవాహమైంది. అన్నపు గిన్నెలో కన్నీటి చుక్కలు పడగా, పైతుండును మొహానికి అడ్డంగా పెట్టుకొని, మజ్జిగ ముట్టకుండానే ఆ గిన్నెను తీసుకెళ్ళి కుడితి కుండలో బోర్లించాడు. ఆదేమని అమ్మగారు అపేక్ష అంతః

కరణతో ఆక్షేపించగా - 'ఆకలిగాలేదు' అన్నాడు ముక్తసరిగా. ఆపట్టున చావడిలోకి వెళ్ళి, బండితొట్టిలో కూలబడి గోడుగోడున ఏడ్చాడు — 'రాముడూ — భీముడూ' గిత్తల్ని చూస్తూ, ఇరవై సంవత్సరాలుగా పరిచయమై, మనస్సుల్లో కలిసిపోయి, అహర్నిశలూ తలపుకొచ్చే లంకంత దొడ్డిని చూస్తూ

రెండోపూట అన్నానికి రమ్మనమని అమ్మగారు చిన్నపాలేరుతో కబురంపినా, కోటేశు ఆ మధ్యాహ్నం ఆ చావడి ఒదిలి వెళ్ళలేదు. దగ్గరుండి గిత్తలకు ఎండుగడ్డీ, జనపకట్టె దానా పెడుతూ కూర్చున్నాడు - మధ్యమధ్య ముక్కు చీదుతూ, కళ్ళు తుడుచుకుంటూ ఆ గిత్తల్ని ఎన్నోమాట్లు ప్రేమాభిమానాలు వెల్లివిరియగా, మమతాను బంధాలు పొంగుకురాగా వాటేసుకొని కన్నీటి ధారను చెక్కిళ్ళపై కాలువలు గట్టించాడు. కొంచెంసేపు పిచ్చెత్తినట్లుగా దొడ్డి మొరాబాలో పచార్లు చేశాడు. మరి కొంచెంసేపు వామిచుట్టూ ప్రదక్షిణలు చేశాడు. ఇంకొంచెంసేపు వాముల దొడ్లో తను పెట్టి పెంచిన కూరగాయల పాదులచుట్టూ నిర్విరామంగా తిరిగాడు.

కడ సంజవేళ షావుకారు వెంకటసుబ్బయ్యగారు ఇంటిలోవుండి కబురు చేయగా, కోటేసుకు వెళ్ళక తప్పలేదు. షావుకారుగారు హాలు బయట మెల్లాలో పడకకుర్చీలో చుట్టకాలుస్తూ కూర్చున్నాడు. సూర్యుని అంతిమ కరణాలు మెత్తని ఎకుపుదనం కొబ్బరిచెట్టు ఆకులపైబడి వింత శోభతో మెరుస్తోంది.

ఇంటిలోనుంచి ఓజత వెండిజరీ ధోవతులనూ, పైపంచలనూ, లాంక్లాత్ చొక్కాలను తెప్పించి, షాహుకారుగారు కోటేశు చేతుల్లో పెట్టాడు. ఆయనగారి కనుకొలుకుల్లో నీటి తటి తొంగిచూడకపోలేదు. అయినా నిబ్బరంగా నిలదొక్కుకొని గంభీరంగా అన్నాడు. "ఈ ఇంటిలో నువ్వు అడుగుపెట్టి ఇరవై యేళ్ళయింది. ఇంటిలో మనిషిగా కలిసిపోయావు. ఈనాడు నిన్ను బయటకు పంపించాలంటే, నాకూ బాధగానే ఉంది. కాని తప్పదు. నువ్వూ, నీ భార్యా, పిల్లలూ కలకాలం సుఖంగా ఉండాలనే కోరుతున్నాను. మంచివాళ్ళకెప్పుడూ భగవంతుడు తిరుపతికొండవలె అండగానే ఉంటాడు.''

కోటేశు గవ్యాపత్తుగబడింది. ఇంటిలో అందరికీ వైనవైనంగా చేతులెత్తి నిశ్శబ్దంగా నమస్కారాలు చేసి, చావటిలోనికి వెళ్ళాడు.

వేపచెట్టు కొమ్మల్లోంచి సూర్యుడు అస్తమిస్తున్నాడు.

రాముడు దగ్గరకూ, భీముడు దగ్గరకూ వెళ్లి కోటేశు వాటి ముట్టెల నుంచి తోకలవరకు నెమ్మదిగా తనివితీర నిమిరాడు. నీళ్ళు నిండిన కళ్ళతో లంకంత దొడ్డినీ, తనకేసి మోరలెత్తి అమాయకంగా చూస్తున్న పశువుల్నీ చూసి—నిప్పుకణికెల్లాంటి నిట్టూర్పులను విడిచాడు. ఆ పైన అడుగు ఆమడగా ఆ చావటిలోనుంచి కదిలి ఆ ప్రొద్దుగూకుముందు ఇంటికి వెళ్ళాడు.

అతను బావురుమన్నాడు.

ఆ దొడ్డి బావురుమన్నది.

అందులోని పశువులు బావురుమన్నవి.

ఆ రాత్రి కోటేశుకు గుండె చెదరిపోయి నిద్రపట్టలేదు. పొరలు పొరలుగా దుఃఖం పొర్లుకురాగా మంచంమీద పొల్లిగింతలు పెడుతూ ఆలోచిస్తూనే ఉన్నాడు. కోటమ్మ విసుక్కున్నది. నిర్లక్ష్యంగా ఓదార్ప ప్రయత్నించింది. ఆ తర్వాత ఎప్పుడో కునుకుతీసింది.

తెల్లవారు ఝామున కోడికూతకు లేచి, మొగుడు మంచంకేసి చూసి, కోటమ్మ అద్భుతపడిపోయింది. నులకమంచంమీద అతగాడు లేడు. ఎక్కడికి వెళ్ళాడు? అనుకుంది అంతేగాని పెద్దగా తట్టు ముట్టు పడలేదు. తెల్లతెల్లవారే దాకా ఇంటిపనుల్ని ముద్రశుద్ధిగా చేసుకుంది. ఆ పైన షావుకారుగారింటికి వెళ్ళింది— మొగుణ్ణిగురించి వాకబు చేయటానికి.

చావడిలో షావుకారు వెంకటసుబ్బయ్యగారు కొయ్యబారిపోయి నిలబడ్డాడు. గాటికి కట్టివేసిన గిత్తలు లేవు. గోడకు చేటచేరువుగా పెట్టిన నాగలీ, దూలానికి తగిలించిన పట్టెళ్ళూ, పగ్గాలూ, మోకూలేవు. మచ్చుమీద వుండాల్సిన మంగళగిరి ముల్లుకర్రకూడా లేదు.

“కోటేశు తెల్లవారుఝామున వచ్చాడు. అరక కట్టుకొని తూర్పు పొలం వెళ్ళాడు. పసుపుతోట దుక్కి దున్నటానికి.”

అప్పుడే అక్కడికొచ్చిన కోటమ్మ ఆమాటల్ని విన్నది. ఆమె మొహంపై మొక్కజొన్నలు పేలాలు వేగాయి.

షావుకారు వెంకటసుబ్బయ్యగారు నరాలు పుటుక్కుమనేట్టు నిట్టూర్పు విడిచాడు.

మలిఝాము ప్రొద్దుకు అన్నంమూట తీసికొని కోటమ్మ తూర్పుపొలం వెళ్ళింది. అల్లంతదూరంలో భర్తను చూసింది. ఆమె మనస్సు ముప్పేట గొలుసులా బెట్టుగా బిగిసింది. నురుగులు కక్కుతూ కోటేసు కొండ్ర వేస్తున్నాడు. 'హేహే' అంటూ మధ్యమధ్య గిత్తల్ని ఆపేక్షగా అదిలిస్తున్నాడు.

"ఏమయ్యోయ్! మళ్ళీ షావుకారు గారింటిలో కమతానికి కుదిరావా?" అన్నది కోటమ్మ చేను గట్టుపై నిటారుగా నిలబడి.

కోటేసు పగ్గాల్ని లాగి పట్టుకుని, గిత్తల్ని చాలుమధ్యలో నిలిపి, భార్యకేసి విస్తుపోతూ చూశాడు.

"ఈ గిత్తల్నీ, ఈ నాగల్నీ, ఈ పొలాన్నీ విడిచిపెట్టలేక! నేను కమతం మానుకుంటే షావుకారుగారు ఈ గిత్తల్ని అమ్మేస్తాడు. షావుకారు నా జీతాన్ని భరించలేక పోతే, చిన్న పాలేరు జీతానికే కమతం చేస్తాను."

కోటమ్మ మొహం కత్తెర ఎండలా మండిపోయింది.

"ఏమయ్యోయ్! ఇరవై యేళ్ళపాటు వూడిగం చేసిన మనిషిని ఒదులుకోవడానికి షావుకారుగారు సిద్ధపడితే, వెధవది నువ్వు ఈ గిత్తల్ని ఒదిలి పెట్టలేక పోతున్నావా? ఇదెక్కడికొయ్యమతం? ఎంత విడ్డూరం? మనిషికి మనిషిమీద మమత లేనప్పుడు నీకు పసువుల మీద ఇంత భ్రమత దేనికి?" అన్నది కోటమ్మ కప్పరపాటుతో.

(ఆంధ్ర పత్రిక)

---0---